క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



గూడెపుపల్లిలో పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రంగంపేట, ముస్కుపల్లి, గూడెపుపల్లి, ఇల్లంతకుంట, గాలిపల్లి గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం వేలాది కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎంపీడీవో మీర్జా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మన్సిపల్ కార్మికులకు రావాల్సిన ఎనిమిది నెలల పెరిగిన పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్యకు డిమాండ్ నోటీస్ ఇచ్చి మాట్లాడారు. విలీన గ్రామాల్లోని 33 మంది కార్మికులకు పాతవి మూడేళ్ల పీఎఫ్ బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే అందించాలని లేనిపక్షంలో ఏప్రిల్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. నాయకులు మూశం రమేశ్, కోడం రమణ పాల్గొన్నారు.

క్రీడా మైదానం కోసం నిరసన



నిరసన తెలుపుతున్న యువకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని యువకులు మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో క్రీడా మైదానం పేరు చెప్పి రూ.20 లక్షలతో పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన స్థలాన్ని అభివృద్ధి చేశారని, కాని ఇప్పుడు ఈ స్థలం తమకు సంబంధించిందని పోలీస్ శాఖ, యువకులు ఏర్పాటు చేసుకున్న వాలీబాల్ నెట్లు కట్ చేయడంతో పాటు, తమను మైదానం నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. తమ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. క్రీడామైదానం ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. యువకులు మధు, బాబు, మోజేస్, నిఖిల్, సంతోష్, జనార్ధన్, వినయ్, అరవింద్, కార్తీక్, వెంకటేష్, బాలయ్య, రాజు, హరికృష్ణ, దత్తు, కిషన్, పర్శరాం, అనీల్, ప్రశాంత్, అజయ్, నాగరాజు, రాము, వెంకటేష్, నవీన్, విజయ్, రుషి, హరీశ్, అనీల్, మల్లేశం, శ్రీకాంత్, హరీశ్ పాల్గొన్నారు.

విస్తరణకు వీడని గ్రహణం

- సింగిల్ రోడ్డుతో ప్రయాణికుల తిప్పలు
- ఐదున్నర కిలోమీటర్లకు అందని నిధులు
- ప్రతిపాదనలకు మోక్షం లభించేనా.?

ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కొత్తగా వేసిన రహదారులను డబుల్ రోడ్లుగా మార్చిన పాలకులు ముస్తాబాద్, మద్దికుంట, మోహినికుంట రహదారిపై మాత్రం దృష్టిసారించలేదు. నూతన రహదారులు, సింగిల్ రోడ్లు, డబుల్ రోడ్లుగా మారాయి. కాని నిజాంకాలం నాటి ఈ రహదారి విస్తరణకు మోక్షం లభించడం లేదు.

మంత్రి కేటీఆర్, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ముస్తాబాద్-సిరిసిల్ల, ముస్తాబాద్ వయా జిల్లెల్ల, ముస్తాబాద్-సిద్దిపేట, ముస్తాబాద్-చీకోడు రహదారులను డబుల్ రోడ్లుగా మార్చారు. నిజాంకాలం నాటి ముస్తాబాద్ వయా మద్దికుంట, మోహినికుంట, దుబ్బాక రహదారిని మాత్రం విస్తరించడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రయాణికుల విజ్ఞప్తి చేసినా అమలుకు నోచుకోలేదు. చివరకు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే దివంగత రాంలింగారెడ్డి అసెంబ్లీలో విజ్ఞప్తి చేసిన ఫలితం లేకుండాపోయింది.



ప్రమాదకరంగా మొర్రాయిపల్లెకు వెళ్లే సింగిల్ లేన్ రహదారి

పొరుగు జిల్లాలో మొదలైన పనులు

ముస్తాబాద్ నుంచి దుబ్బాక వరకు ఆర్అండ్‌బీ రహదారి ఉంది. దుబ్బాక నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా సరిహద్దు గ్రామం మోహినికుంట వరకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. అయితే మోహినికుంట నుంచి ముస్తాబాద్ వరకు ఉన్న ఐదున్నర కిలోమీటర్లకు మాత్రం నిధులు రాలేదు. ఈ రహదారికి ఒకేసారి నిధులు మంజూరు చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలనే ప్రజల కోరిక తీరడం లేదు.

చిన్న రోడ్డుతో అవాంతరాలు..

ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు ఉన్న ఐదున్నర కిలోమీటర్లకు అనేక మలుపులు ఉన్నాయి. ముస్తాబాద్ శివారులోనే రోడ్డు పక్కన ప్రమాదకరంగా మలుపు వద్ద బండరాళ్లు ఉన్నాయి. ఇక మద్దికుంట శివారులో రెండు చోట్ల రోడ్డు మలుపులు వాహన చోదకులను ఇబ్బందికి గురిచేస్తాయి. ఈ ప్రాంతాల్లో అనేక ప్రమాదాల్లో ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. మద్దికుంట శివారులో రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు రెన్యూవల్ పనులు చేయాలని చేసిన ప్రతిపాదనలకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మెయింటెన్స్‌కు నిధులు వచ్చినా విస్తరణకు నిధులు మంజూరు కాకపోవడంతో ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంటవాసులు నిరాశకు గురయ్యారు. అంతర్ జిల్లా రహదారిని వెంటనే విస్తరించి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

నిధులు విడుదలయ్యేనా.?

సిద్దిపేట జిల్లా పరిధిలోని రహదారి విస్తరణకు నిధులు మంజూరు కాగా, మిగిలిన ఐదున్నర కిలోమీటర్ల రహదారి పనులకు ఆర్అండ్‌బీ అధికారులు రూ. 14 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేశారు. ప్రజాప్రతినిధులు సైతం ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిధులు ఇవ్వాలని మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈఎన్‌సీ వద్ద ఈ ఫైల్ పెండింగ్‌లో ఉంది. నిధులు మంజూరయ్యేలా స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం.

ప్రమాదకరంగా సింగిల్ లేన్



ముస్తాబాద్, దుబ్బాక రహదారి చాలా ప్రమాదకరంగా వుంది. సిద్దిపేట జిల్లా వరకు నిధులు వచ్చాయి. మిగిలిన పనులకు మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేయాలి. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వెళ్లే వాహనాలు రోడ్డు దిగలేకపోతున్నారు.

– గజ్జెల రాజు, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపించాం



ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు రూ.14 కోట్లకు ప్రతిపాదనలు చేశాం. త్వరలోనే నిధులు వస్తాయని ఆశిస్తున్నాం. దీంతో రెన్యూవల్ పనులు నిలిపివేశాం. నిధులు మంజూరు కాగానే విస్తరణ పనులు చేపడుతాం. మలుపుల వద్ద రహదారిని విస్తరిస్తాం.

– నరేందర్, ఏఈ, అర్అండ్‌బీ

త్వరలోనే నిధులు మంజూరు



రోడ్లు భవనాల శాఖ మంత్రిని కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశాం. ఈఎన్‌సీ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ రహదారిని విస్తరించాలని మంత్రి కేటీఆర్ కూడా చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు మొదలు పెడుతాం. ఇది ప్రజల చిరకాల వాంఛ.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జవాబుదారీతనంగా మెలగాలి
- అధికారులతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూచించారు. సంగీత నిలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. , ప్రజలకు జవాబుదారీతనంగా మెదలుకోవాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు పనులకు జిల్లా అటవీ శాఖాధికారులు వెంటనే అనుమతులు ఇవ్వాలని జిల్లా అటవీ అధికారి బాలామణిని ఆదేశించారు. త్వరలోనే మేడిపల్లి-గోవిందరావుపేట రోడ్డుకు భూమిపూజ చేస్తామన్నారు. తక్కళ్లపల్లి వద్ద రైతులతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టబోతున్నామన్నారు. రుద్రంగిలో డబుల్ బెడ్రూం ఇళ్లకు ఈఎన్‌సీ రవీందర్‌రావుతో మాట్లాడి అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. మూలవాగుపై నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి జూన్‌లోగా పూర్తి చేయాలన్నారు. మల్లారం, శాత్రాజుపల్లి వద్ద రూ.7 కోట్లతో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. రాజన్న గుడి నుంచి కట్ట కింది బస్టాండ్ వరకు, తెలంగాణ చౌక్ నుంచి పాపన్న చౌక్ వరకు రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో జగిత్యాల జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, చందుర్తి సెస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఈఈలు శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, డిప్యూటీ ఈఈలు వెంకటరమణ, సాంతయ్య, ఏఈలు సతీశ్, మధు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భజన



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ సంప్రోక్షణ, నవకలశ స్థాపన, దేవతా ఆహ్వానం, బలిహరణం, అగ్నిప్రతిష్ఠ హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అఫెరా సుల్తానా, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలి

- కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

వేములవాడఅర్బన్: విద్యార్థులు తమ జీవితానికి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారుపాక గ్రామంలో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో అయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఆనంతరం వలంటీర్లు గ్రామంలో 100, 101, 108 ప్రభుత్వ సర్వీసు నెంబర్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు నీలం శ్రీనివాసులు, నారాయణ, దీపిక పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించండి

- కలెక్టర్‌కు బీజేపీ కౌన్సిలర్ల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ కౌన్సిలర్లు

వేములవాడ: ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, అర్హులైన వారికి దళితబంధు పథకం అమలు చేయాలని బీజేపీ కౌన్సిలర్లు, కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌లకు పలు సమస్యలను వివరించారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ గ్రాంట్ పెట్టలేదని ఆరోపించారు. వేములవాడ పట్టణానికి మరొక స్మశానవాటిక మంజూరు చేయాలని, మూలవాగులో మురుగు కలువకుండా చూడాలని, సీతారాముల కల్యాణం జరిగే ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేయించాలని కోరారు. మినీ స్టేడియం పనులు పూర్తికాక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు. వీటిని పరిగణలోకి తీసుకుని వేములవాడ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. బీజేపీ కౌన్సిలర్లు రేగుల సంతోష్‌బాబు, అన్నారం ఉమారాణి, తిరుమల్‌రెడ్డి కవితారెడ్డి, రామతీర్థపు కృష్ణవేణి, గడ్డమీది లావణ్య పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం



పోషకాహారంపై ప్రతిజ్ఞ చేస్తున్న కార్యకర్తలు

ముస్తాబాద్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం మహిళల చేతుల్లోనే ఉందని సీడీపీవో ఆలేఖ్య అన్నారు. ముస్తాబాద్ సెక్టార్‌లో పోషణ పక్షోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాసం, బాలింతలకు పోషకాహారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. కేంద్రాల్లో అందించే ఆహారాన్ని తీసుకోవడంతోపాటు, స్థానికంగా లభించే చేపలు, పాలు, మాంసం, తృణధాన్యాలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ సుమతి, సూపర్‌వైజర్ అరవింద, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీటీసీ మంజుల, టీచర్లు పాల్గొన్నారు.

బంజెరులో

వీర్నపల్లి: మండలంలోని బంజెరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సాముహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ కళ, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు సుష్మ, అంజమ్మ, స్వరూప, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వేములవాడఅర్బన్/వీర్నపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని రంగాల కార్మికులు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. వేములవాడ, వీర్నపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా దేశంలో అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల, రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకోవాలన్నారు. అలాగే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, హమాలీ సంఘం అధ్యక్షుడు మ్యాకల దేవయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు బుసా రాజం, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే విద్య, వైద్యం



విద్యార్థికి వైద్య సేవలు అందిస్తున్న డా.మయూరి

వేములవాడరూరల్: వేములవాడ భవిత సెంటర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఇంటి వద్దనే విద్య, వైద్యాన్ని అందజేస్తున్నారు. వేసవి సెలవులు ఉన్నందున విద్యతో పాటు అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు ఫిజియోథెరపి చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో భవిత సెంటర్ నిర్వాహకురాలు జయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ మయూరి ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

కోనరావుపేట: వడగళ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు పురుషోత్తంరావు అన్నారు. మండలంలోని మరిమడ్లలో అకాల వర్షాలతో పంటలు కోల్పోయిన పంటలను పరిశీలించి మాట్లాడారు. వడగండ్ల వానలతో పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మర్తనపేట మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్, దిలీప్, భాస్కర్, రమేశ్, రాజు, నారాయణ, ఎంపీటీసీ రేణుక పాల్గొన్నారు.

లక్ష రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి

- నసుగుల సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



సీఈవోను ప్రశ్నిస్తున్న రైతు

చందుర్తి: రైతులు తీసుకున్న రూ.లక్ష లోపు రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని సనుగుల పీఏసీఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని సనుగుల సింగిల్‌విండో సమావేశాన్ని చైర్మన్ జలగం కిషన్‌రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రైతులకు ఇచ్చే రుణాల నుంచి మూలధనాన్ని తమకు లెక్కలు చెప్పాలని సభ్యులు కోరారు. సనుగుల గ్రామంలో ఎరువుల బస్తాలకు గోదాం నిర్మించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రేకుల షెడ్లను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. అలాగే ఎరువుల బస్తాలను విక్రయించడం వల్ల రూ.4.64 లక్షల ఆదాయం,. ధాన్యం కొనుగోలులో 48.46 లక్షల కమీషన్ వచ్చినట్లు సీఈవో శ్రీవర్ధన్ వివరించారు. వచ్చిన ఆదాయం నుంచి ఐదుగురు సిబ్బందికి తొమ్మిది నెలల వేతనాలను రూ.7.11 లక్షలు ఇచ్చినట్లు వివరించారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ విజయ్, డైరెక్టర్లు కేసీరెడ్డి నర్సారెడ్డి, బానోతు పుల్‌సింగ్, గొట్టే శంకరయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సత్యంరెడ్డి, మాజీ డైరెక్టర్లు నగేశం, రైతులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: ఇటీవలప్రమాదవశాత్తు మృతి చెందిన గాయిత్రీ బ్యాంకు కస్టమర్ బానోత్ నీలా భర్త బానోత్ రాజుకు బ్యాంకు ద్వారా అందించే రూ. ఒక లక్ష బీమా చెక్కును ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా మంగళవారం అందించారు. బ్రాంచ్ మేనేజర్ సమ్మెట శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ సర్వే

తంగళ్లపల్లి: మండలంలోని రామన్నపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం స్వచ్ఛభారత్ మిషన్ సర్వే తోపాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఎం సురేశ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మౌలిక వసతులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి, గ్రామాన్ని మరింత గొప్పగా ఎలా తీర్చిదిద్దాలి అని వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు ఆత్మకూరి రంగయ్య, ముదారి పోచయ్య, ఎంపీడీవో పి.లచ్చాలు, ఏపీఎం బి.పర్శరాములు, టీపీఎం.సుష్మ, పంచాయతీ కార్యదర్శులు హరిత, వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త కంచర్ల రాజు కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, చీటీ ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం ఆయనను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా తుర్కకాశి వద్ద కాన్వాయ్ వాహనాలు ఢీకొట్టుకున్న ఘటనలో రాజు గాయపడిన విషయం తెలిసిందే. పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు ఉన్నారు.



వీడ్కోలు హంగామా

వీర్నపల్లి: ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ విశ్వనాథం పాల్గొన్నా రు.

సంక్షిప్త వార్తలు

భవన నిర్మాణానికి ప్రొసీడింగ్ అందజేత

చందుర్తి: నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్‌ను వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఆ సంఘ సభ్యులకు మంగళవారం అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు అవార్డు అంకితం

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా తీసుకున్న ఉత్తమ అవార్డును పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అంకితం చేస్తున్నట్లు సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం అవార్డును కార్మికులకు అందజేస్తూ పారిశుధ్య కార్మికులు కష్టపడితేనే ఈ అవార్డు వచ్చిందని అందుకే వారికే అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు తీసుకోవడానికి సమష్టిగా పని చేయాలన్నారు. కార్యదర్శి దేవరాజు, ఉపసర్పంచ్ రజిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అగ్గితెగులుపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిపైరుపై అగ్గి తెగులు ప్రారంభమవుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్ సూచించారు. తెగులు నివారణకు తగు సస్యరక్షణ చర్యలను తీసుకోవాలన్నారు. గట్లపై గడ్డిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ప్రధాని నరేంద్ర మోడీ పేద ప్రజలందరికి ఖరీదైన వైద్యం అందించేందుకు హెల్త్ కార్డులను అందిస్తున్నట్లు అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు.

విజేతలకు బహుమతులు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎగుర్ల ఎల్లయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎంపీపీ మానస, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్ మంగళవారం బహుమతులు అందజేశారు.

సర్పంచ్ భర్త మృతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామ సర్పంచ్ జింక సునీత భర్త వేణు (39) ఆనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వేణు మృతదేహానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు పూలదండ వేసి నివాళి అర్పించారు.

తైబజార్ టెండర్ ఖరారు

ముస్తాబాద్: పంచాయతీ తైబజార్ వేలం రూ.3.30 లక్షలకు టెండర్‌ను ఖరారు చేసినట్లు సర్పంచ్ సుమతి, కార్యదర్శి రాజు తెలిపారు.